పైపులైన్ నిర్మాణపనులను వేగంగా పూర్తి చేస్తాం

పైపులైన్ నిర్మాణపనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబితాకిశోర్

మల్కాజిగిరి, ఫిబ్రవరి 7: పైపులైన్ నిర్మాణపనులను వేగంగా పూర్తి చేస్తామని వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితాకిశోర్ అన్నారు. శుక్రవారం వెస్ట్ వెంకటాపురం శివాలయం వద్ద రూ.60వేలతో పైపులైన్ నిర్మాణపనులను కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ కృష్ణమాచారి, వర్క్ ఇన్స్పెక్టర్ శేఖర్, అనిల్‌కిశోర్, లోకేష్, వరప్రసాద్, సత్యనారాయణ, అమృత, విజయ, రాకేష్, దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వినతి

జడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్ కు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్.

రామంతాపూర్,ఫిబ్రవరి 7: నాచారం డివిజన్‌లోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ కలిసి వినతి పత్రం సమర్పించారు. ఓల్డ్ విలేజ్‌లో రూ54 లక్షలతో సిమెంట్ రోడ్డు వేశామని మిగిలిన రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. పలు కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ తవ్వకాల వల్ల రోడ్లు పాడైనాయని వాటి స్థానంలో కొత్త రోడ్లు నిధులు మంజూరు చేయాలన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న బన్నాల దంపతులు

రామంతాపూర్,ఫిబ్రవరి 7: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పుట్టిన రోజును పురస్కరించుకొని శుక్రవారం కార్పొరేటర్ బన్నాల గీతతో కలిసి కుటుంబ సమేతంగా తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలి

- కలెక్టరేట్‌లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌పై ఆరోగ్య శిబిరం
- పరీక్షలు చేయించుకున్న ఉద్యోగులు

వైద్య పరీక్ష చేయించుకుంటున్న అడిషనల్ కలెక్టరేట్ విజయేందర్ రెడ్డి

శిబిరంలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా, డీఎంహెచ్‌వో రఘునాథ స్వామి

మేడ్చల్, ఫిబ్రవరి 7: మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలని అడిషనల్ కలెక్టర్‌లు విజయేందర్ రెడ్డి, రాధికా గుప్తా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రొమ్ము, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్‌పై ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు ఇంటి పనులు, కార్యాలయ విధుల్లో నిమగ్నమై తమ ఆరోగ్యం పట్ల కొంత నిర్లక్ష్యం వహిస్తారన్నారు. ఆరోగ్య శిబిరాలు ఇందుకు ఉపకరిస్తాయన్నారు. మహిళలు రొమ్ము, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఖరీదైనవని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించడం హర్షణీయమన్నారు. కలెక్టరేట్ సిబ్బంది వినియోగించుకోవాలని వారు సూచించారు. అనంతరం జిల్లా వైద్య శాఖ అధికారి రఘునాథ స్వామి మాట్లాడుతూ శిబిరంలో జనరల్ ఫిజిషియన్, గైనకాలజీ, డెర్మాటలజీ, డెంటల్, రేడియోలజీ విభాగాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ శిబిరంలో 224 మంది ఉద్యోగులు పాల్గొనగా, 448 రక్త నమూనాలు తీసుకున్నారు. 61 మందికి సర్వైకల్, 124 మంది ఓరల్‌క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌వో హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, డాక్టర్లు, మెడికల్ సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారికి స్వర్ణ యజ్ఞోపవీతం
బంగారు ఆభరణం బహూకరణ

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 7 : ఆనంద్‌బాగ్ చౌరస్తాలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి భక్తులు 'స్వర్ణ యజ్ఞోపవీతం' బంగారు ఆభరణం విరాళాన్ని అందజేశారు. శుక్రవారం ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎ.బి రవీంద్ర రెడ్డి స్వీకరించి ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వెంకట రమణాచార్యులచే శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి అలంకరించారు. ఆభరణం 49 గ్రాముల 940 మిల్లి గ్రాముల బరువు ఉందని విరాళం అందజేసిన గౌతంనగర్ డివిజన్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది రేఖ, శ్రీనివాస్ పేర్కొన్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు తులసి వెంకట రమణా చార్యులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ సంద్ర సుధాకర్, భక్తులు జోగేశ్వర్ కుమార్, సంజయ్ గుప్త, కామేశ్వర్ రావు, రాజ్యలక్ష్మి దేవి, లావణ్య , సుధాకర్, జయశ్రీ, సుధారాణి, రేఖ, భానుతదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి ఆలయంలో ఈవోకు, ప్రధాన అర్చకులకు బంగారు ఆభరణాలను అందజేస్తున్న దాతలు

తీన్మార్ మల్లన్నపై కేసు నమోదు

అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మల్కాజిగిరి, ఫిబ్రవరి 7: అగ్రవర్ణాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నపై కేసు నమోదైన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ రాహులదేవ్ కథనం ప్రకారం ... 4న వరంగల్‌లో జరిగిన బీసీ సభలో ఎమ్మెల్సీ చింతపండు నవీన్ మాట్లాడుతూ రెడ్డి, అగ్రవర్ణాలపై పరుష పజాలంతో మాట్లాడుతూ ప్రసంగించారని, చాలా సందర్భాల్లో యూట్యూబ్ చాన్‌లో మల్లన్న మాట్లాడిన వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకుని చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్ రెడ్డి, మాదవరెడ్డి,రాంరెడ్డి,సంజీవ్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, రాజసింహారెడ్డి ఫిర్యాదు చేశారు

గుట్కా సంచుల స్వాధీనం

పోచారం,ఫిబ్రవరి7: పోచారం పోలీస్టేషన్ పరిధిలో రెండు గుట్కా సంచులను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు.వరంగల్ రోడ్డు అన్నోజిగూడ ప్రాంతంలోని కుటీర్ విల్లాస్ రోడ్డులోని ఓ వ్యవసాయ క్షేత్రంలోని గేటు పక్కన గుర్తు తెలియని వ్యక్తులు ఈ సంచులను పడేసివెళ్లినట్లు పోలీసులు తెలిపారు.శుక్రవారం ఉదయం ఈ సంచులను గమనించిన వ్యక్తి పోచారం పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు గుట్కా సంచులను పరిశీలించి స్టేషన్‌కు తరలించారు.వీటి విలువ రూ.20వేల వరకు ఉంటుందని అంచనా వేశారు.

జంక్షన్ల అభివృద్ధికి ముమ్మరంగా చర్యలు

ఈసీఐఎల్ జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ నిత్యానందం

కాప్రా, ఫిబ్రవరి 7: కాప్రాసర్కిల్ పరిధిలో కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఆయా కూడళ్లను(జంక్షన్లను) ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జీహెచ్ఎంసీ ఎల్‌బీనగర్ జోన్ ఎస్ఈ నిత్యానందం అన్నారు. శుక్రవారం ఆయన సర్కిల్ ఈఈ నాగేందర్, డీఈఈ బాలకృష్ణ, ఏఈలతో కలిసి రూ.1.9 కోట్లతో ఈసీఐఎల్ , రాధిక జంక్షన్లను వెడల్పు చేసి అభివృద్ధి చేసేందుకు చేపట్టిన పనులను ఎస్ఈ నిత్యానందం శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు మీటర్ల వ్యాసం ఉన్న ఈసీఐఎల్ కూడలిని రెండు మీటర్లకు కుదించి, ఫ్రీ లెఫ్ట్ విధానంలో తగురీతిన అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. డీఈఈ బాలకృష్ణ మాట్లాడుతూ ఈసీఐఎల్‌లో రెండు వైపుల, రాధిక జంక్షన్లలో రెండు వైపుల రోడ్డు వెడల్పు పనులు పూర్తి అయినట్టు, స్థలం సమస్య కారణంగా మిగతా రోడ్ల వెడల్పుకు కొంత ఆలస్యం జరుగుతున్నదనీ, త్వరలోనే పరిష్కరించేదుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

సంతల్లో చెత్త తొలగింపునకు వ్యాపారులు సహకరించాలి

చెత్త తొలగింపుపై అవగాహన కలిగిస్తున్న శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్

కాప్రా, ఫిబ్రవరి 7: వారాంతపు సంతల్లో పోగయ్యే చెత్తను వెంట వెంటనే తొలగించేందుకు వ్యాపారులు సహకరించాలని జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ కోరారు. ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని మహేష్‌నగర్, రాధిక చౌరస్తాల్లో వారాంతపు సంత సందర్భంగా శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో సంతలోని చెత్తను తొలగించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. పాదచారులకు, వాహనదారులకు, స్థానికులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సర్కిల్ పరిధిలోని ప్రధాన వీక్లీమార్కెట్ల వద్ద ఈ ప్రత్యేక వాహనం ఏర్పాట్లు చేసినట్లు డీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు నివారణపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజ్యలక్ష్మి

రామంతాపూర్,ఫిబ్రవరి 7: రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ కుష్టు వ్యాధి దినం సందర్భంగా విద్యార్థులకు కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఇండియన్ అసోసియేషన్ కోశాధికారి లెప్రోలజిస్టు డాక్టర్ రాజ్యలక్ష్మి కోనాధన్ మాట్లాడుతూ కుష్టును ముందుగా రోగ నిర్ధారణ ,ఎండిటీ బ్లిస్టర్ ప్యాక్‌లలో క్యాప్ రిపాంఫిసిన్ ట్యాబ్ డాప్సోన్ ట్యాబ్ క్లోఫాజమైన్ మల్టి డ్రగ్ థెరఫీ ద్వారా సమస్యను నివారించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలోఅసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ సుజయ్ సునీత,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ మున్సిపల్ మేనేజర్‌గా వేణుగోపాల్ రెడ్డి

వేణుగోపాల్ రెడ్డి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 7: ఘట్‌కేసర్ మున్సిపల్ మేనేజర్‌గా వేణుగోపాల్ రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తించిన వెంకట్ రెడ్డి కమిషనర్‌గా పదోన్నతి పొంది బదిలీకావటంతో ఆయన స్థానంలో అంకుషాపూర్ సెక్రటరిగా విధులు నిర్వహిస్తున్న వేణుగోపాల్ రెడ్డిని ఘట్‌కేసర్ మున్సిపల్ మేనేజర్‌గా నియమిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు.

100 శాతం పన్నులు వసూళ్లు చేయాలి

కమిషనర్, సిబ్బందితో మాట్లాడుతూ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు

శామీర్‌పేట, ఫిబ్రవరి 7 : తూంకుంట మున్సిపాలిటీని శుక్రవారం మున్సిపాలిటీ అడ్మినిస్ట్రేషన్ హైదరాబాద్ రీజియన్ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బయో మైనింగ్ పనులను పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పన్ను వసూళ్లపై ఆరా తీశారు. మార్చిలోపు 100 శాతం పన్ను వసూళ్లు సాధించాలని బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకట్ గోపాల్, డిప్యూటీ ఈఈ సునీత, మేనేజర్ శ్రావణ్‌కుమార్, ఈఈ కన్నేశ్వర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి పురస్కారాలు

పురస్కారాలను అందుకున్న ఆర్టీసీ ఉద్యోగులు

మేడ్చల్, ఫిబ్రవరి 7: డిసెంబరులో విధుల్లో ప్రతిభ చూపిన ఆర్టీసీ కార్మికులకు శుక్రవారం ప్రగతి పురస్కారాలను ప్రదానం చేశారు. అత్యధిక ఇన్సెంటివ్ సాధించిన కండక్టర్లు, అత్యధిక ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లు, బ్రేక్ డౌన్ లేకుండా బస్సులను నిర్వహించిన మెకానిక్‌లకు పురస్కారాలను మేనేజర్ సుధాకర్ శాలువా, ప్రశంసా పత్రాలతో సన్మానించారు. ఈ కార్యక్రంలో అసిస్టెంట్ మేనేజర్ రామారావు, అసిస్టెంట్ ఇంజినీరు స్నేహలత, సూపరింటెండెంట్ పీఎస్ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

కీసర, ఫిబ్రవరి 7: రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన కీసర పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగారం మున్సిపాలిటీ రాంపల్లిదాయరకు చెందిన కందాడి ధనలక్ష్మి తన కొడుకుతో కలిసి బైక్‌పై ఈసీఐఎల్‌కు వెళ్తున్నారు. రాంపల్లి చౌరస్తాలో బైక్ అదుపుతప్పడంతో ప్రమాదవశత్తు పెట్రోల్ ట్యాంకర్ వెనుక టైర్ల కింద ధనలక్ష్మీ ఆమె కొడుకు పడిపోయారు. ఈ ప్రమాదంలో ధనలక్ష్మి తలకు బలమైన గాయాలయ్యాయి. ఆ మార్గం గుండా వెళుతున్న వారు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. ఆ అంబులెన్స్‌లో వారిని నగరంలోని ఓ దవాఖానకు తరలించారు. ఆమె తలకు బలమైన గాయాలు కావడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక

నూతన ఉత్సవ కమిటీ సభ్యులు

చర్లపల్లి, ఫిబ్రవరి 7: చర్లపల్లి డివిజన్ శ్రీ సద్గుర్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ధీరావత్ హనుమంత్‌నాయక్, శ్రీనివాస్ నాయక్‌లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కిషన్‌నాయక్, సతీష్‌నాయక్, లింగం నాయక్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనునాయక్, రవినాయక్, ఇస్లావత్ హరినాయక్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా జగన్‌నాయక్, రెడ్డినాయక్, శేఖర్ నాయక్, ము ఖ్య సలహాదారులు గా ఏఐబీఎస్ఎస్ జి ల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, సలహాదారులుగా నర్సింహానాయక్, శంకర్‌నాయక్, జమిలానాయక్, లక్ష్మణ్‌నాయక్, దంజినాయక్, శివుడునాయక్, చంద్‌నాయక్, దశరథ్‌నాయక్, రమేశ్, హచ్యనాయక్,మాన్‌సింగ్‌నాయక్, కిషన్, చందన్, కమిటీ సభ్యులుగా లావుడియా, సురేశ్, రవి, జీవి, హిరాలాల్, పాండు, రాందాస్, హీర్యా, భాస్కర్, గణేశ్, మం జ్యా, బాలు, జయచందర్, సైదా, లక్ష్మ ణ్,రవి,నర్సింహాలు ఎన్నికయ్యారు.

9న అవార్డుల ప్రదానం

కాప్రా, ఫిబ్రవరి 7: కాప్రా సర్కిల్ ఏఎస్‌రావునగర్‌లోని డాక్టర్ ఏఎస్‌రావు అవార్డ్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 34వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అవార్డులను అందజేసే కార్యక్రమాన్ని ఈ నెల 9న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు డాక్టర్ ఏఎస్‌రావు అవార్డ్స్ కౌన్సిల్ ప్రతినిధులు తెలిపారు.

ఆలియాబాద్‌లో ఆధార్ కేంద్రం ప్రారంభం

ఆధార్ సేవలను నిర్వహిస్తున్న సిబ్బంది

శామీర్‌పేట, ఫిబ్రవరి 7: మండల పరిధిలోని ఆలియాబాద్ గ్రామ ఉన్నత పాఠశాలలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి రోజు ఆధార్ కేంద్రం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుందన్నారు. కొత్త ఆధార్ కార్డు కోసం, మార్పులు, చేర్పులకు ఇక నుంచి గ్రామస్తులు దూరం గా వెళ్లాల్సిన పని లేదన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు వారు సూచించారు.

మినరల్ వాటర్ ప్లాంట్స్ ప్రారంభం

చీర్యాల్‌లో రాంకీ సంస్థ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్‌లను ప్రారంభిస్తున్న చీర్యాల్ నేతలు

కీసర, ఫిబ్రవరి 7: దమ్మాయిగూడ మున్సిపాల్టీ పరిధిలోని చీర్యాల్‌లో నాలుగు చోట్ల మినరల్ వాటర్ ప్లాంట్‌లను రాంకీ సంస్థ స్వచ్ఛందంగా విచ్చేసి శుక్రవారం ప్రారంభించారు. రూ.5 కాయిన్ వేస్తే 20 లీటర్ల టిన్ను వాటర్ క్యాన్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ రామిడి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ తుంగ ధర్మేందర్, మాజీ ఉప సర్పంచ్ జిల్లాల తిరుమల రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కులగణనతో బీసీల గొంతుకోసిన కాంగ్రెస్ సర్కార్
నోటి దురుసు బీసీజాతికి నష్టం

బోడుప్పల్, ఫిబ్రవరి7: కులగణన పేరుతో బీసీ వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తీరని ద్రోహానికి పాల్పడ్డదని బోడుప్పల్ బీఆర్ఎస్ నాయకులు కొత్త రవిగౌడ్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...2014లోనాటి ముఖ్య మంత్రి నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 51శాతం ఉన్న బీసీలు 46శాతానికి ఎలా తగ్గుతుందని నిలదీశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కులగణన పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త నాటకానికి తెరలేపారని ఆరోపించారు.

విద్యార్థిని ఆత్మహత్య

ఉప్పల్ ఫిబ్రవరి 7 : ఇంట్లో ఎవరు లేని సమయంలో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఇందిరా నగర్ కాలనీ రామంతాపూర్ లో నివాసం ఉండే నీలం పవిత్ర (15) కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో 10వ తరగతి చదువుతున్నది. ఉదయం 10:30 గంటల సమయంలో పవిత్ర తల్లి నీలం పావని తన కూతురిని స్కూల్ నుండి పర్మిషన్ తీసుకొని హాస్పిటల్ కు తీసుకువెళ్లి, తర్వాత సుమారు 12:30 గంటల సమయంలో ఇంట్లో వదిలి.. బ్యాంకు పనిమీద బయటికి వెళ్ళింది. తిరిగి వచ్చి చూసే వరకు పవిత్ర ఇంట్లో ఉన్న హాల్లో సీలింగ్‌ఫ్యాన్ కి చీరతో ఊరివేసుకుని కనిపించింది. వెంటనే చుట్టుపక్కల వాళ్ళ సహాయంతో కిందికి దించి చూడగా అప్పటికే పవిత్ర మృతి చెందింది. మృతురాలి తల్లి నీలం పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై వారానికి 5రోజులు అవగాహన

జిల్లా ఫైర్ ఆఫీసర్ వీరబత్తిని శ్రీనివాస్

కాప్రా, ఫిబ్రవరి 7: రాబోయే వేసవి లో అగ్ని ప్రమాదాలు జరుగకుండా అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేయనున్నట్లు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఫైర్ ఆఫీసర్ వీరబత్తిని శ్రీనివాస్ తెలిపారు. వేసవికి ముందుగానే చర్లపల్లి పారిశ్రామికవాడలో ఇటీవల జరిగిన ప్రమాదం నేపథ్యంలో జిల్లా అగ్నిమాపక అధికారి వి. శ్రీనివాస్‌తో అగ్నిప్రమాదాల నివారణకు అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో చేపట్టే 'అగ్నిప్రమాదాల నివారణ,అవగాహన సదస్సుల'కు సంబంధించిన అంశాలపై' నమస్తే ' మాట్లాడింది. పారిశ్రామికవాడల్లో తరచూ వేసవిలో జరిగే అగ్నిప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని చర్లపల్లి, నాచారం, మల్లాపూర్, కుషాయిగూడ పారిశ్రామికవాడల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు చేపడ్తున్నట్టు, వారానికి ఐదు రోజులు ఈ కార్యక్రమాలు ఉంటాయని డీఎఫ్ఓ వెల్లడించారు. ముఖ్యంగా కెమికల్ పరిశ్రమల్లో ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందనీ, వీటిపై దృష్టిసారిస్తామనీ, అగ్నిమాపక నియమ, నిబంధనలను ఉల్లంఘించే పరిశ్రమలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. ముఖ్యంగా పరిశ్రమలకు సమీపంలోనే జనావాసాలు ఉండ టం వల్ల ఆయా కాలనీలు, బస్తీల్లో కూడా అవగాహన కార్యక్రమాలు చేపడుతామని డీఎఫ్ఓ వి.శ్రీ నివాస్ అన్నారు. చర్లపల్లి సర్వోదయ కెమికల్స్ అగ్నిప్రమాదంకు సంబంధించి ఎంత మేర నష్టం జరిగిందీ ఇంకా నిర్ధారణకు రాలేదని అన్నా రు. ప్రమాదం జరిగిన రోజు అర్ధరాత్రి 12 గంటలకు పూర్తి గా మంటలను ఆర్పివేయడం జరిగిందని అన్నారు. అగ్నిప్రమాదం తర్వాత కూడా ప్రతి రోజు ఫైర్ అధికారులు అప్రమత్తంగా ఉండి, లీకేజీ రసాయనాలు రీ ఇగ్నైట్ కాకుండా చర్య లు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కెమికల్ పరిశ్రమలో ఉన్న 20కేఎల్ కెమికల్ స్టోరేజీ ట్యాంకుకు పగుళ్లు ఏర్పడి కెమికల్ బయటకు లీక్ కావడం వల్ల కొంత ఇబ్బంది కలిగింది. కెమికల్ పరిశ్రమ యాజమాన్యం అగ్నిప్రమాదంకు సంబంధించి జరిగిన నష్టం వివరాలను ఇవ్వాల్సి ఉంటుందని, అది వారి నుంచి అందాల్సి ఉందని అన్నారు. అగ్నిప్రమాదాలు జరుగకుండా పరిశ్రమలు, సంస్థల యజమానులు అగ్నిమాపకశాఖ సూచనలు,నియమాలుపాటించాలని అన్నారు.

కమ్యూనిటీహాల్‌లో అగ్నిప్రమాదం

మల్లాపూర్, ఫిబ్రవరి 7: హెచ్‌బీకాలనీ ప్రధానరహదారిపై ఉన్న హౌసింగ్‌బోర్డ్‌కు చెందిన శిథిలావస్థలో ఉన్న కమ్యూనిటీహాల్ ఆవరణలో శుక్రవారం ఉదయం స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. కమ్యూనిటీ హాల్ ఆవరణలో పోగై ఉన్న చెత్త, ఇతర వ్యర్థాలకు నిప్పుంటుకోవడంతో మంటలు లేచాయి. హాలుకు పక్కన ప్రహరీకి ఆనుకొని ఉన్న పాత రేకుల షెడ్డు, దాని కింద ఉన్న చెత్త, ఇతర వ్యర్థాలకు నిప్పు అంటుకొని కొంత సేపు మంటలు ఎగిసిపడడంతో పోలీసులకు, ఫైర్ అధికారులకు సమాచారం అక్కడే విధులు నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ శానిటరీ సిబ్బంది, స్థానికులు బకెట్లతో నీళ్లు కుమ్మరించి మంటలను చాలావరకు ఆర్పేశారు. సంఘటనాస్థలాన్ని హెచ్‌బీకాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటాచారి, రవీందర్‌రెడ్డి, ఎన్.శ్రీనివాస్ పరిశీలించారు.

అక్రమ నల్లా కనెక్షన్లపై చర్యలు

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 7: అక్రమ నల్లా కనెక్షన్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జలమండలి నాగారం సెక్షన్ మేనేజర్ సాయికిరణ్ గౌడ్ హెచ్చరించారు. ఇప్పటికే అక్రమ కనెక్షన్లు కలిగి ఉన్న వారు, కొత్తగా పొందేందుకు ప్రయత్నిస్తే తనిఖీలు నిర్వహించి, చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ నల్లా కనెక్షన్ల కారణంగా అధికారికంగా నల్లా కనెక్షన్లు పొందిన వారికి తక్కువ నీరు వస్తున్నాయని,లో ప్రెషర్ కూడా వస్తుందన్నారు. నల్లా బిల్లులను ప్రజలు సకాలంలో చెల్లించాలని సూచించారు. తద్వారా మెరుగైన సరఫరాకు అవకాశం ఉంటుందని తెలిపారు. బిల్లుల చెల్లింపు, నీటి సరఫరాలో సమస్యలు ఉంటే నాగారం సెక్షన్ కార్యాలయానికి రావాలని, వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన చెప్పారు.

దొంగకు దేహశుద్ధి..పోలీసులకు అప్పగింత

పీర్జాదిగూడ, ఫిబ్రవరి7: దొంగకు దేహశుద్ధి చేసిన స్థానికులు పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం... ఘట్‌కేసర్ మండలం ముత్వేల్‌గూడలోని డ్రీమ్ హోమ్స్ కాలనీలో గురువారం అర్ధరాత్రి కాలనీలోని ఓ ఇంటి తాళాలు పగలగొట్టిలోనికి చొరబడి చోరీకి యత్నిస్తున్న గుర్తుతెలియని దొంగలను కాలనీవాసులు పట్టుకొని దేహశుద్ధి చేసి అనంతరం పోలీసులకు అప్పగించినట్లు కాలనీవాసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కీసర, ఫిబ్రవరి 7: మండలంలోని అంకిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్ 12కేవీ సాల్వ్ ఎక్స్‌ప్లోసింగ్ ఫీడర్ పరిధిలో శనివారం కరెంట్ కోత విధిస్తున్నామని ఏఈ మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఈనెల 8న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సాల్వ్ ఎక్స్‌ప్లోసింగ్, బాలాజీ మెటల్ ఇండస్ట్రీస్,జయరాంరెడ్డి మెటల్ ఇండస్ట్రీస్, జైదేవి కాంక్రిట్ కంపెనీలో విద్యుత్ కోత విధిస్తున్నామని ఏఈ తెలిపారు.

రేషన్ బియ్యం, గోధుమలు పట్ట